క్లుప్తంగా

గండిపోశమ్మను దర్శించుకున్న ఎంపీ, ఎమ్మెల్యేలు



గండిపోశమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న ఎంపీ మాధవి, ఎమ్మెల్యే ధనలక్ష్మి

దేవీపట్నం: అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మిలు మంగళవారం గండిపోశమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. పోలవరం ప్రాజెక్టు సందర్శనకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి రావడంతో ఆ కార్యక్రమానికి హాజరైన వీరు తిరుగు ప్రయాణంలో మార్గమధ్యలో గండిపోశమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది సాదరంగా ఆహ్వానించారు. ఎంపీపీ కుంజం మురళీ, పార్టీ నాయకులు శిరశం పెద్దబ్బాయిదొర, కందుల బాబ్జి, పోలిశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



పారిశుధ్య పనులు చేయిస్తున్న ఈవోపీఆర్డీ నాయుడు

జి.మాడుగుల: గిరిజనులు ఇళ్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈవోపీఆర్డీ నాయుడు తెలిపారు. స్థానిక మెయిన్ రోడ్డులో మంగళవారం పారిశుధ్య పనులు నిర్వహించారు. రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు.

విద్యార్థులకు డ్యాన్స్ పోటీలు



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థిని

డుంబ్రిగుడ: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు మంగళవారం డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి శెట్టి సునీత మాట్లాడుతూ ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నట్టు చెప్పారు. వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీపీఎం నాయకుడు కన్నారావుకు నివాళి



కన్నారావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

చింతూరు: మండలంలోని వేకవారిగూడెంకు చెందిన సీపీఎం నాయకుడు ఉయికా కన్నారావు మంగళవారం మృతిచెందారు. ఆయన మృతదేహం వద్ద ఆ పార్టీ నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి సీసం సురేష్, ఎర్రంశెట్టి శ్రీనివాస్, పల్లపు వెంకట్ పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తం



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

చింతపల్లి: వ్యాధుల పట్ల గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని లంబసింగి పీహెచ్‌సీ వైద్యాధికారి నీరజ అన్నారు.మండలంలోని ఎర్రబొమ్మలలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు.సుమారు 70 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.కొద్దిపాటి అనారోగ్యానికి గురైనా సమీపంలోని ఆస్పత్రులకు వైద్య సేవలు పొందాలని తెలిపారు.

దేశానికి ఆదర్శం సీఎం జగన్ పాలన

'గడపగడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



కిటుములలో లబ్ధిదారునికి బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే పాల్గుణ

జి.మాడుగుల: దేశానికే ఆదర్శంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన ఉందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలో కోరాపల్లి గ్రామ సచివాలయ పరిధిలో లోకిటుముల, కిటుముల, తగ్గిమెట్ట, అరగడాపల్లి, పాలకొండ గ్రామాల్లో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఆయా గ్రామాల్లో గిరిజనుల నుంచి అనూహ్య స్పందన లభించింది. 241 గడపలను సందర్శించి, ప్రభుత్వ పాలన,నాలుగేళ్లలో అందించిన సంక్షేమ పథకాలపై వివరించారు. సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందే విధంగా సచివాలయ సిబ్బంది,వలంటీర్లు దృష్టి సారించాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్‌రావు, సర్పంచ్‌ల ఫోరం మండల గౌరవ అధ్యక్షుడు కిముడు రాంబాబు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ఎస్.రామకృష్ణ, ఎంపీటీసీలు అంగనయిని నానాజీ,గబ్బాడి సన్యాసిదొర, చిన్నారావు, చిట్టిబాబు, సర్పంచ్‌లు సీదరి కొండబాబు, వెంకటేష్, గంగరాజు, మండల సచివాలయ కన్వీనర్ కల్యాణం, వైఎస్సార్‌సీపీ నాయకులు పెదబాలన్న, వంతాల కృష్ణారావు పాల్గొన్నారు.

అన్ని వేళలా అండగా ఉంటా
– అరుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

హుకుంపేట: మండుటెండను సైతం లెక్క చేయకుండా ఉదయం నుంచి సాయంత్రం వరకు మారుమూల గ్రామాల్లో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పర్యటించి, ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అన్ని వేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మండలంలోని మత్స్యపురం పంచాయతీ రాళ్ళ మత్స్యపురం,పెదబూరుగులు,డుంబ్రిగుడ, ఊటగెడ్డ, తంబిడిపుట్టు, సెంబి,కొత్తవలస,బంగారుమెట్ట గ్రామాల్లో మంగళవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.

268 గడపలను సందర్శించి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో గిరిజనులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. సెంబి, బంగారు మెట్ట గ్రామాల్లో సీసీ రోడ్డు,అంగన్‌వాడీ భవనం మంజూరు చేయాలని,పెద బూరుగులులో రహదారి సౌకర్యం కల్పించాలని గిరిజనులు కోరారు. ఎమ్మెల్యే స్పందించి కొద్ది రోజుల్లోనే సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పెదబూరుగులు గ్రామంలో గుండెపోటుతో మృతిచెందిన పాంగి కృష్ణారావు మృతదేహం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు ఒంటుబు సామ్యూల్, పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి రామకృష్ణ,సర్పంచ్‌లు పూజరి మేరి,సమిడ వెంకటపూర్ణిమ,పాంగి సింహాచలం,లక్ష్మయ్య,ఎంపీటీసీ సభ్యురాలు కిల్లో మీనా, నాయకులు అనిల్,సుబ్బారావు, వెంకట్,మహేష్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు రాజవొమ్మంగిలో గడపగడపకు

రాజవొమ్మంగి: మండలకేంద్రం రాజవొమ్మంగిలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించను న్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శింగిరెడ్డి రామకష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత బాబు హాజరు అవుతారని పేర్కొన్నారు.

త్వరితగతిన ఈకేవైసీ



సచివాలయ సిబ్బందితో సమావేశమైన ఎంపీడీవో బాపన్నదొర

రాజవొమ్మంగి: వైఎస్సార్ బీమాకు సంబంధించి ఈకేవైసీని త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో బాపన్నదొర వలంటీర్లను ఆదేశించారు. మంగళవారం ఆయన రాజవొమ్మంగి-1, రాజవొమ్మంగి-2 సచివాలయాల్లో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రికార్డులన్నీ సక్రమంగా ఉండాలన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



స్కూటీలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ ఉషారాణి, ఏఎంసీ చైర్మన్ రాజారమేష్

అరకులోయ రూరల్: దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎంపీపీ రంజపల్లి ఉషారాణి తెలిపారు. దివ్యాంగులకు మంజూరైన స్కూటీలను మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీపీ ఉషారాణి, ఏఎంసీ చైర్మన్ కిల్లో రాజారమేష్ వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ మాధవి మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలోని ఆరు మండలాల్లో గల ఏడుగురు దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం స్కూటీలు మంజూరు చేసినట్టు చెప్పారు. అర్హులైన దివ్యాంగులను గుర్తించి రెండో విడతలో స్కూటీలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు భీమరాజు, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు గెడ్డం నర్సింగరావు,ఎంపీడీవో నగేష్, సర్పంచ్ దాసుబాబు,నాయకులు చందుపాడి,నర్సింగ్, దివ్యాంగుల వెల్ఫేర్ సొసైటీ డైరెక్టర్ ధర్మ,సొసైటీ కో-ఆర్డినేటర్లు యాదయ్య, కైలాష్, రామనాగేశ్వరరావు, రామరావు పాల్గొన్నారు.

నేడు చింతూరులో ఉపాధి హామీ ప్రజావేదిక

చింతూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధిహామీ పథకం పనులపై ప్రజావేదిక నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వెంకటరత్నం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని 18 పంచాయతీల్లో గతనెల 24 నుంచి ఈనెల 6వ తేదీ వరకు 2022-23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులపై 14వ విడత సామాజిక తనిఖీ నిర్వహించినట్టు ఆయన తెలిపారు. దీనికి సంబంధించి బుధవారం ఉదయం 10 గంటలకు ప్రజావేదిక నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణాల్లో జాప్యం చేస్తే చర్యలు

ఐటీడీఏ పీవో అభిషేక్



సమావేశంలో మాట్లాడుతున్న పీవో అభిషేక్

పాడేరు రూరల్: అంగన్‌వాడీ భవన నిర్మాణాల్లో జాప్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ హెచ్చరించారు.పాడేరు డివిజన్‌లో జరుగుతున్న అంగన్‌వాడీ భవన నిర్మాణాల పురోగతిపై ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ 128 కొత్త అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు.

రెండవ విడత రివాల్వింగ్ ఫండ్ జమ చేసినట్టు చెప్పారు. చాలా భవనాల నిర్మాణాలు నేటికీ గోతుల స్థాయిలోనే ఉన్నాయన్నారు అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలకు సీడీపీవోలు,సూపర్‌వైజర్లు బాధ్యత వహించవలసి ఉంటుందన్నారు. పనులను మహిళా పోలీసులు పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో ఐటీడీఎస్ పీడీ ఎస్.సూర్యలక్ష్మి, గిరిజన సంక్షేమశాఖ ఈఈ డి.వి.ఆర్.ఎం.రాజు తదితరుల పాల్గొన్నారు.

భూ రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి



కదుమూరులో భూ సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బంది

మారేడుమిల్లి : ప్రభుత్వం చేపట్టిన భూ రీ సర్వేను గిరిజన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కుండాడ సర్పంచ్ కుండ్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు. జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా మంగళవారం మండలంలోని కుండాడ పంచాయతీ పరిధిలోని కదుమూరులో భూ రీ సర్వే కార్యక్రమాన్ని సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులకు సంబంధించిన భూముల్లో ఎటువంటి సమస్యలు ఉన్నా తమకు తెలియజేయాలని, వాటిని రెవెన్యూ సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లి తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో మురళీ కృష్ణ, పంచాయతీ కార్యదర్శి దుర్గా ప్రసాద్, సర్వేయర్ కృష్ణ, గిరిజన రైతులు పాల్గొన్నారు.

పాఠశాలలకు పుస్తకాల సరఫరా



ఉపాధ్యాయులకు పుస్తకాలు అందజేస్తున్న ఎంఈవో చంద్రశేఖర్

గూడెంకొత్తవీధి: ఈ ఏడాది విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే మండలంలోని అన్ని పాఠశాలలకు అవసరమైన పాఠ్యాంశాలను సరఫరా చేస్తున్నట్టు ఎంఈవో చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని పాఠశాలలన్నింటికీ పుస్తకాలు అందించాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్టు చెప్పారు. మంగళవారం మండల కేంద్రంలో పలు పాఠశాలల ఉపాధ్యాయులకు పుస్తకాలు అందజేశారు.

కాలుష్య రహిత గ్రామాలే లక్ష్యం



నుర్మతిలో మొక్కలు నాటుతున్న పోలీసులు



వై.రామవరంలో నిర్వహించిన అవగాహన ర్యాలీ

జి.మాడుగుల: ప్లాస్టిక్, కాలుష్య రహిత గ్రామాలే లక్ష్యంగా సీఆర్‌పీఎఫ్ పనిచేస్తోందని నుర్మతి ఆర్మ్‌డ్ పోలీస్ ఔట్‌పోస్టు(ఏవోపీ) సీఆర్‌పీఎఫ్198బీన్ ఓసీ ఉదయ్‌కుమార్ తెలిపారు. మండలంలో నుర్మతి ఏవోపీ పరిసర గిరిజన గ్రామాల్లో వారం రోజుల పాటు పలుఅంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. దోమతెరలు, డస్ట్‌బిన్లు పంపిణీ చేశారు. దీనిలో భాగంగా నుర్మతిలో మంగళవారం చెత్తాచెదారాలను తొలగించి, మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యకరమైన జీవనంపై దృష్టి సారించాలన్నారు. నీటిని ఆదా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ శ్రీనివాస్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

వై.రామవరం: పర్యావరణ పరిరక్షణలో భాగంగా మంగళవారం స్థానిక సచివాలయ కార్యదర్శి మధుసూదనరాజు ఆధ్వర్యంలో వై.రామవరంలో ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు అందరూ సహకరించాలన్నారు. ఈకార్యక్రమంలో ఎస్‌ఐ ఎం. సంతోష్ కుమార్,పాల్గొన్నారు.

అరకులోయరూరల్: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని న్యాయవాదులు ప్రభాకర్,సింహాచలం తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కోర్టు ఆవరణలో జడ్జి శివకిరణ్ ఆదేశాల మేరకు మంగళవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూప్రతిఒక్కరూమొక్కలుపెంచాలన్నారు.



మొక్క నాటుతున్న న్యాయవాదులు

ఘనంగా సదానంద సరస్వతి స్వామీజి జయంతి



హిందూ ధర్మం ఔన్నత్యాన్ని వివరిస్తున్న బెనారస్ బాబూజీ

అడ్డతీగల: సదానంద సరస్వతి స్వామీజీ జయంతిని మంగళవారం స్థానిక పవనగిరి క్షేత్రంలో ఘనంగా నిర్వహించారు.హైదరాబాద్‌కి చెందిన విజయదుర్గ దేవస్థానం వ్యవస్థాపకులు,జగదాంబ త్రిశక్తి పీఠాధిపతులు అయిన బెనారస్ బాబూజీ గురూజీ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య ఆధ్వర్యంలో సదానంద సరస్వతి స్వామీజీ విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. ఈ సందర్భంగా సదానంద సరస్వతి రజిత పాదుకలకు అభిషేకం,కుంకుమ పూజ జరిపారు.ఈ కార్యక్రమంలో బెనారస్ బాబూజీ మాట్లాడుతూ హిందూ ధర్మం ఔన్నత్యం ,గురుతత్వం తదితర అంశాలపై భక్తులకు వివరించారు. అనంతరం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, కొమ్ముడోళ్ల నృత్యాలు పలువురుని అలరించాయి. ఆరు గిరిజన గ్రామాలకు భజన సామగ్రి, డప్పులు అందజేశారు. పతంజలి శ్రీనివాస్ పలువురు వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేత గోపవరం జట్టు



గోపవరం జట్టు

కొయ్యూరు: డౌనూరులో బోడకొండమ్మ జాతర సందర్భంగా నిర్వహించిన క్రికెట్ పోటీల్లో గోపవరం జట్టు విజయంసాధించింది. రన్నర్‌గా రామాపురంజట్టు నిలిచింది. విజేతలకు మంగళవారం ఉత్సవ కమిటీ సభ్యులు బోనంగి అప్పారావు, ప్రసాద్,దొండ ప్రసాద్, సురేష్ పట్నాయక్, కె.అప్పారావు, జి.బాలరాజు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిగా రూ.పదివేలు, ద్వితీయ బహుమతిగా రూ.ఐదువేల నగదు అందజేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత



బాధితులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి



ఎంపీపీ ఆనందరావుకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు

కూనవరం: సీఎం రిలీఫ్ ఫండ్‌ను బాధితులు సద్వినియోగం చేసుకోవాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ అన్నారు. కూనవరం గ్రామానికి చెందిన కొండారు వెంకట నర్సమ్మకు రూ.80 వేలు, దూగుట్ట గ్రామానికి చెందిన సోందె పాపారావుకు రూ.35 వేలు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు కాగా, ఆ చెక్కులను ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు సోమవారం రాత్రి బాధితులకు అందజేశారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ పాయం రంగమ్మ, జేసీఎస్ మండల ఇన్‌చార్జీ ఆవుల మరియాదాస్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరి కోటేశ్వరరావు, మేరుకులం రాష్ట్ర డైరెక్టర్ డి.గంగాధర్, వ్యవసాయ కమిటీ చైర్మన్ ఇంటి పూర్ణానందం, సొసైటీ అధ్యక్షుడు నోముల కొండలరావు, గుజ్జాబాబు, మడకం పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరం: తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న స్థానిక ఎంపీపీ కడబాల ఆనందరావు తల్లి సన్యాసమ్మకు అస్పత్రి ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.20 వేలు మంజూరు చేశారు. యల్లవరంలో ఎంపీపీ ఆనందరావుకు మంగళవారం ఎమ్మెల్సీ అనంతబాబు ఈ చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్ర వెంకటలక్ష్మి, ఎంపీటీసీ వీరమళ్ళ సుబ్బలక్ష్మి, సర్పంచ్ పల్లాల బాలురెడ్డి, సొసైటీ అధ్యక్షులు పల్లాల అబ్బాయిరెడ్డి, స్థానిక నాయకులు కరణం కనకరాజు, మంచినీళ్ళ నారాయణరావు, వెలిదిండి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

దుస్తులు, భోజనం ప్యాకెట్ల పంపిణీ



దుస్తులు, భోజనం ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న సీఆర్‌పీఎఫ్ డీ42 బెటాలియన్ పోలీసులు

వై.రామవరం: సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్ వద్ద సీఆర్‌పీఎఫ్ డీ42 బెటాలియన్ సిబ్బంది 190 మంది పేదలకు దుస్తులు, భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. బెటాలియన్ అసిస్టెంటు కమాండెంట్ ఎంఎల్ నాయుడు ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ వీటిని పంపిణీ చేశారు.

జోరుగా పైనాపిల్ వ్యాపారం

గిరి రైతులకు లాభాలు



వంట్లమామిడి ప్రాంతంలో విక్రయానికి సిద్ధం చేసిన పైనాపిల్

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో పైనాపిల్ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. పండ్ల అమ్మకాల ద్వారా గిరిజనులకు మంచి లాభాలు వస్తున్నాయి. సీజన్ ప్రారంభం కావడంతో గిరిజనుల నుంచి వ్యాపారులు పోటాపోటీగా కొనుగోలు చేస్తున్నారు. పాడేరు మండలం వంట్లమామిడి, 12వ మైలు రాయి, చింతపల్లి మండలం చిత్రాలగొప్పు తదితర ప్రాంతాల్లో పైనాపిల్ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మైదాన ప్రాంతాలకు చెందిన వ్యాపారులు నేరుగా గిరిజన గ్రామాలకు వెళ్లి పండ్లను కొనుగోలు చేసి, వ్యానుల్లో తరలిస్తున్నారు. పాడేరు మండలంలోని సలుగు, దేవాపురం, వంట్లమామిడి, జి.మాడుగుల మండలంలోని సంఘం, సొలభం, గడుతూరు, గెమ్మెలి, చింతపల్లి మండలంలోని తాజంగి, అంజలి శనివారం, లంబసింగి ప్రాంతాల్లో పూర్వం నుంచి పైనాపిల్ సాగు చేస్తున్నారు. సుమారు 200 ఎకరాల్లో ఈ తోటలు ఉన్నాయి. ప్రస్తుతం దిగుబడులు ఆశాజనకంగా ఉండడంతో పాటు పండ్లు పెద్దవిగా ఉండడంతో రైతులకు మంచి లాభాలు వస్తున్నాయి. సైజును బట్టి రూ.20 ధరతో వ్యాపారులు గిరిజనుల వద్ద కొనుగోలు చేస్తున్నారు.రోడ్డు పక్కన దుకాణాలు వేసే చిరువ్యాపారులు రూ.30 ధరతో రిటైల్‌గా విక్రయిస్తున్నారు.

రైతులకు విత్తనాలు సరఫరా చేయాలి

చింతూరు: వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న దృష్ట్యా రైతులకు సకాలంలో విత్తనాలు అందించాలని అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి కుంజా దూలయ్య మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా వరి, మొక్కజొన్న, అపరాలు, మిర్చి విత్తనాలు సరఫరా చేయాలని, వ్యవ సాయ పరికరాలను సబ్సిడీపై అందించాలని వడ్డీలేని రుణాలు మంజూరు చేయాలని ఆయన కోరారు.

వ్యవసాయాధికారి బాధ్యతల స్వీకరణ



ఉమాదేవి

కొయ్యూరు: మండల వ్యవసాయ అధికారిగా డి.ఉమాదేవి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.ఆమె యలమంచిలి నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఏవో కృష్ణవేణిని చీడికాడ బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఉమాదేవి సచివాలయాల వ్యవసాయ, హార్టికల్చర్ సహాయకులతో సమావేశం నిర్వహించారు. సకాలంలో రైతులకు విత్తనాలు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

రహదారి నిర్మాణానికి భూమి పూజ



భూమిపూజ చేస్తున్న ఎంపీపీ రమేష్

కొయ్యూరు: నల్లగొండ పంచాయతీ బోయవుట కొత్తవీధి రహదారి నిర్మాణ పనులకు ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ వారా నూకరాజు,చింతపల్లి ఏఎంసీ చైర్మన్ జె.రాజులమ్మ మంగళవారం భూమి పూజ చేశారు.గత నెల ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ఆ ప్రాంతంలో పర్యటించారు. ఆ సమయంలో గ్రామస్తులు కోరిన మేరకు రోడ్డు మంజూరు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ త్వరలో విద్యుత్‌సౌకర్యం కల్పిస్తామని చెప్పారు.